# మెరుపు మెరిసింది !

రచన :
ఏ. యస్. రామారావు

మనసులో మెరుపు మెరిసింది!

రాధ హృదయం ఆనందంతో వుక్కిరి బిక్కిరయింది. యావ్వనోద్రేకమంతా నదిలా ఒక్కసారి పొంగి పొరలి నట్లనిపించింది. ఏవేవో తీయని అనుభూతులు పొందింది. కాని, రాధకేం సంతృప్తి కలగలేదు. మళ్ళీ మరొకసారి కృష్ణమూర్తి బావ తనతండ్రిపేర వ్రాసిన వుత్తరాన్ని ఆ చీకటి గదిలో, చాటుగా, కిటికీప్రక్క నిల్చుని చదువుతుంది....

శంకరం మామయ్యకు—

నమస్కారములు. ఇక్కడ మేం క్షేమం. మీరంతా క్షేమమనే భావిస్తూన్నాం. నువ్వు ఎప్పటి కప్పుడు మమ్మల్ని రమ్మని వ్రాస్తూండడం; నాకు సెలవు దొరక్కనో, మరీ కారణం చేతనో రాలేకపోతుండడం జరుగుతోంది. మొన్ననే రమణ వ్రాసిన వుత్తరం అందింది. వాళ్ళకి సెలవులు ఇచ్చేరట. వాడక్కడికి వస్తూన్నట్టు, నన్ను మరీమరీ రమ్మని వ్రాసేడు. మిమ్మల్నందర్నీ చూసి అప్పుడే అయిదేళ్ళయింది. పైగా అమ్మకూడా బలవంతం చేస్తోంది. అంచేత సెలవు పెట్టాను. సెలవు గ్రాంటయింది. అమ్మని తీసుకుని, ఆదివారంనాటికి అక్కడికి వస్తున్నాను. ఆనాటి మెయిలుకు బండి పంపించవల్సింది.

రాధ బాగా పెరిగి పెద్దదైయుంటుంది. వయస్సుతో పాటు పెంకితనం కూడా పెరిగిందా? లేదా? చిన్నప్పటిలా ఇంకా కొంటిపనులు చేస్తోందా? మాంవయ్యా! నీకు తెలియదు కాని-నన్నెంత అల్లరి పెట్టేదనుకున్నావు! ఏడ్చేదాకా వదిలేదికాదు అప్పుడప్పుడు. 'ఇదివరకటి బావ కాదు ఇప్పుడొస్తున్నద'ని చెప్పు రాధకి.

రాజిగాడు ఇప్పుడు తిన్నగా బడికి పోతున్నాడా? వాణ్ణి బడివరకూ మొయ్యలేక, బళ్ళోకి తీసికెళ్ళలేక నేనూ, రమణ యమయాతన పడేవాళ్ళం. వెధవ - పెంకిఘటం. అంతకు తప్పిస్తే తెలివైనవాడేసుమా!

అత్తయ్యను మరీ మరీ అడిగానని చెప్పు. ఆదివారం స్టేషనుకు బండి పంపించటం మర్చిపోకు.

ఇట్లు,
కృష్ణమూర్తి.

అబ్బ! ఎంత బాగా వ్రాసాడు తనగురించి. ఉత్తరం అంతా ఒక ఎత్తు. తననిగురించి వ్రాసింది ఒక ఎత్తూను. బావ ఎలా అయినా గడుసుబావే! ఏవీ ఎవరితోనూ చెప్పనని ఆనాడు తనచేతిలో ఒట్టుకూడా వేశాడు. ఎంతగమ్మత్తుగా బయట పెడ్తున్నాడు! నిజమే! తను ఆ రోజుల్లో బావను మహా ఏడిపించేది! బావ అల్లరి పడుతూంటే తనెంతో సంబరపడేది. ఏడుస్తూన్న బావను వెక్కిరించాలనిపించేది తనకు!

మరుపురానిరోజులవి. రాధ మనస్సులో ఆనాటి మధురస్మృతులు ఒకదానివెంట ఒకటి కెరటాల్లా వచ్చేయి. కళ్ళముందు సినిమా బొమ్మల్లా ఆనాటి సరదాలు. ఆటపాటలు కవిపించసాగేయి.

తోటలో చెట్టు చిగురున బొద్దుగా పూసిన సంపెంగ పువ్వులు కోసియ్యమని ఆరోజు మారాం చేసింది. రమణన్నయ్యతో. అన్నయ్య కొయ్యనన్నాడు. ఆ పువ్వులు కోసియ్యకపోతే ఇంటికిరానని పట్టు పట్టింది తను. అన్నయ్య తనమాటల్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయేడు. ఇంకా గట్టిగా అడిగితే, తనని నాలుగు తిట్టి, నాన్నకు ఫిర్యాదు చెయ్యడానికూడా వెనకాడే రకం కాదు వాడిది. తన ముచ్చట తీర్చేవాడు బావ ఒక్కడే. అందుకనే తను బావ చొక్కాపట్టుకు వ్రేళ్ళాడేది. బావతో చెప్పుకుంది తను పూలు కోసియ్యమని. అంత ఎత్తయిన చెట్టు చిగురున పూసిన పూలకోసం బావ ఎక్కితే, పట్టులేని ఆ కొమ్మవిరిగితే, బావగతేం కాను? తనకు ఆ భావనే తోచలేదప్పుడు. తనకు కావల్సిందల్లా ఆ పూలు. తనకోసం ఆ పూలు కోయటానికి బావ అంతపెద్దచెట్టు ఎక్కేవాడు. ఎన్నోపూలు కోసిచ్చేవాడు. బావ చేతితో ఇచ్చిన ఆ పువ్వులు విపరీతమైన పరిమళంతో తనను మత్తెక్కించేవి!

ఆరోజుల్లో జామిచెట్లు విపరీతంగా కాసేవి. ఎక్కడలేని చిలకలు ఆ చెట్లమీదనే వాలేవి. కాయ కాస్త పలుకుమారితే చాలు రుచి చూసేసేవి. ఆ చెట్లమీద అజమాయిషీ అంతా తనదే నన్నట్లు, రమణన్నయ్య ఆ

(తరువాయి ౮వ పేజీలో)

(11వ పేజీ తరువాయి)

చెళ్లెక్కి ఒక్కొక్కటీ కోస్తూ తనని ఊరిస్తూ మరీ తినేవాడు. తనకి ఒక్కటన్నా కోసిచ్చేవాడు కాడు. ఏమయినా అందామనుకుంటే తనకన్నా పెద్దవాడు. తన కేడుపు వచ్చినంతపనయ్యేది. అప్పుడప్పుడు ఏడ్చేసేది కూడా తను. తనలా ఏడుస్తూవుంటే వాడు మరీ రెచ్చిపోయేవాడు. గత్యంతరంలేక తను బావతో చెప్పుకునేది. వెంటనే బావవచ్చి తనకెన్నోపళ్ళు కోసిచ్చేవాడు. రుచిచూసి మరీని. వాటిలో చిలక్కొట్టుకూడా వుండేవి. అయినా సరే, చిలక్కొట్లకన్నా, బావ కొస్తే బావుండేది తనకు!

మావిడి తోపుల్లో ఆడుకునేరోజు అవి. ఎదో చెట్టుమీద చిగుళ్ళమధ్య నెక్కడో ఒక కోయిల 'కుహూ' అనేది. వెంటనే బావకూడా కోయిలతో సమంగా 'కుహూ' అనేవాడు. ఎంతబాగా అనేవాడని! కోయిలకు మిన్నగా వుండేది బావకంఠం. అందుకే స్కూల్లో పిల్లలందరూ బావచుట్టూ చేరి పాటలు, అవీ పాడిస్తూండేవాళ్లు. బావ పాడుతూవుంటే కృష్ణుడు మురళీగానం చేస్తున్నాడా అనిపించేది. నిజానికి తను ఆ మురళీనాదం వినకపోయినా! ఆరాగాలాపనల్లో తను పరవశమయ్యేది!

ఎంతగా తను బావను అల్లరిపెడితేనేం? బావ మాత్రం తనకంటె ఏం తక్కువ తిన్నాడా? అమాయకుడిలా చల్లగా తప్పించేసుకున్నాడు. తన మనస్సులో ఆనాటి మధురస్మృతులు ఇంకా చెరగలేదు. ఎంత మరచిపోదామన్నా, మరువలేని సంఘటనలవి.

తనకింకా జ్ఞాపకముంది ఆనాటిసంగతి. తలపుకొచ్చేసరికి శరీరం పులకిస్తుంది. సిగ్గేస్తుంది. ఆనాడు....

బావని తోటకెళ్ళి మామిడికాయలు కోసుకు రమ్మంది అమ్మ. బావతో సిద్ధమైంది తనూ తోటకి. బావ ఎంతవద్దన్నా తను పట్టును విడవలేదు. చేసేదిలేక తననికూడా తోటకు తీసికెళ్ళక తప్పిందికాదు బావకి.

బావతో పందెంగా కొమ్మవంచి తను సువర్ణ రేఖల్ని కోస్తోంది. ఎక్కణ్ణుంచో ఎర్రచీమ జారి తన బుగ్గను ముద్దిట్టుకుంది. గొప్పమంట వేసింది. అపరిమితంగా బాధ కలిగింది. బాధని భరించలేక బావతో చెప్పుకుంది తను. తనంత బాధ పడుతోంటే బావ పరిహాసం చేస్తూ 'అహా! పచ్చనైన నీబుగ్గ సువర్ణరేఖలా ఎంతందంగా మారిందనుకున్నావు? గులాభికంటె మృదువుగా, ఎర్రగా వుందిలే! ఇక మంటమండుతోందంటావా? అయితే మంత్రం వేస్తానుండం'టూ చటుక్కున ముద్దు పెట్టుకున్నాడు. తనకెంతో సిగ్గేసింది. భావమీద కోపం కూడా కలిగింది. 'ఛో బావా! ఏమిటిది? అమ్మతో చెప్తానుండు నీపని!' అంటూ మెల్లగా బావ చెంపను చరిచింది తను. తను చేసిన పనికి బావ బాధ పడ్డాడు. తను అమ్మతో నిజంగా చెప్పేస్తానేమోనని భయంతో తనని అదోలా చూసేడు బుంగమూతి పెట్టుకుని.

మొదట్లో నిజంగా బావ మంత్రం వేస్తాడేమో ననుకుంది. అనుకున్నట్లుగానే అంత చీమకుట్టిన భాధా బావ తన పెదవులతో బుగ్గతాకినంత సేపు చల్లబడి పోయింది చీమకుట్టిన బాధకంటె, బావను కొట్టినందుకే తను. హెచ్చుగా బాధపడింది. ఆ క్షణంలో అమ్మతో చెప్పా లనిపించినా, మరుక్షణంలో అలా అనిపించలేదు. మరొకసారి బావ అలా అంటేనే బావుండు ననిపించింది అనిపించేసరికి సిగ్గుముంచుకొచ్చేసింది. రెండు చేతుల్లోనూ ముఖాన్ని దాచుకుని నవ్వుకుంది తను బావని వ్రేళ్ళ సందుల్లోంచి చూస్తూ. బావ తనవంక అదోలా చూసేడు. ఆ చూపుల్లో చిరుకోపంకూడా ప్రదర్శించేడు. 'ఇప్పుడు కాదు నీ పని! నిన్ను పెళ్ళిచేసుకున్నాక చెస్తానుండు!' అన్నట్లున్నాయి ఆ చూపులు తనకేదో సిగ్గుతోకూడిన భయం వేసింది. పారి పోబోయింది తను. 'నేనూ వస్తున్నా ఆగు' అంటూ జడపట్టుకుని నిలబెట్టేసేడు. తనపని సర్కసులో జంతువులా అయిపోయింది.

ఆ భావే-తన బావ వస్తున్నాడిప్పుడు. తిరిగి ఎన్నాళ్ళకని? బావకోసం తను కళ్లు కాయలు కాచిపోయినట్లు చూసిందిన్నాళ్ళూ. ఎప్పటి కప్పుడే వస్తానంటూ వ్రాయటం, తను ఆశగా ఎదురు చూస్తుండడమూను తప్పక ఈ సారివస్తాడు. ఈసరికి మెయిలు వచ్చేవుంటుంది. నాన్న, అన్నయ్య, బావతో మాట్లాడేస్తూంటారేమో!

ఈసారి బావపనితప్పక పట్టించాలి. తను పూర్వం. బావకాదట! అక్కడికి తను మహా పూర్వం రాస్తున్నట్టు.

మనసులో చిన్నతనపు రోజులు తలచుకుంటూంటే రాధ మనస్సు పూర్తిగా ఈ ప్రపంచాన్నే వదిలేసింది. ఏపని చేద్దామన్నా మనస్సు నిలవటంలేదు. కృష్ణ ఎంత తొందరగా వస్తాడా అని ఆరాటపడింది. ఒక్కక్షణం లెక్కలేనన్నిసార్లు చూసినత్రోవనే చూసింది. నిరుత్సాహ పడింది, ఉయ్యాల్లో దిగులుతో కూర్చుంది.

ఇంతలో గుమ్మంలో బండి ఆగిన చప్పుడైంది. తండ్రి, అన్నయ్య మాట్లాడుతున్న మాటలు రాధ చెవినపడ్డాయి. వాటిమధ్య మరొక క్రొత్తగొంతు వినిపించింది. ఆగొంతు తనిదివరకెప్పుడో విన్నట్లే ననిపించింది రాధకు బహుశా బావే అయివుంటాడనుకుంది. అనుకోవటమే తడవుగా సిగ్గుతో కూడిన భయంతో శరీరం గజిబిజి అయింది. తుర్రున చీకటి కొట్లోకి పోయింది. ఎందరెన్ని మార్లు పిలిచినా, ఆ కొట్లోంచి బయటికి రాలేదు.

రాధ కనపడుతుందేమోనని కృష్ణ ఆశగా అటూ, ఇటూ చూసేడు. కృష్ణ ఆశలు నిరాశలయ్యేయి. రాజిగాడు కృష్ణకి రాధ ఎక్కడుందో చెప్పేసేడు. కృష్ణకి ఆ చీకటి కొట్లోకి వెళ్ళటానికి ధైర్యం చాల్లేదు. అంతా రాధ వాలకానికి నవ్వుకున్నారు.

స్నానాలు ముగించి అంతా భోజనానికి కూర్చున్నారు. రాధ తల్లి, కృష్ణతల్లి వడ్డిస్తున్నారు, పట్నం విశేషాలు; ఉద్యోగం సంగతులు కృష్ణని శంకరం, రమణ అడుగుతున్నారు. కృష్ణ ఏవో సమాధానాలు కూడా ముక్తసరిగా ఇస్తున్నాడు. కాని, కృష్ణచూపులు మాత్రం వడ్డించిన ఆ పదార్థాలమీదకాని, అక్కడ కూర్చున్నవాళ్లమీదకాని లేవు. రాధకోసం ఆతృతగా వెతుకుతున్నాయి అతని కళ్లు.

తలుపుసందునుంచి ఇదంతా గమనిస్తున్న రాధ బావ [illegible]నికి ముసిముసిగా నవ్వుకుంది. కృష్ణ రూపాన్ని చూసి ఆశ్చర్య చకితురాలైంది.' నిజమే! బావ తనవుత్తరంలో వ్రాసినట్లు ఇదివరకటి బావకాదు. ఎంత బాగా మారిపోయాడు! ఆరోజుల్లో సన్నంగా, ఈన పుల్లలా వుండేమనిషి ఎంత నాజూగ్గా వున్నాడు. నిజంగా ఇప్పుడే బావున్నాడు. పట్నం నీళ్ళు బాగా పడేవుం[టా]యి. శరీరం రంగు వన్నె తేలింది. బావ ముఖానికి ఇప్పుడే ఒడ్డూ, పొడుగూ, రంగూ అన్నీ బాగా అమరేయి. అందుకేనేమో అలా వ్రాసాడు?' రాధ ఏమేమో అనుకుంది మనసులో.

ప్రయాణపు బడలిక తీర్చుకునేందుకు కృష్ణ మేడమీదకెక్కి పడుకున్నాడు కృష్ణతో కబుర్లు చెప్పుకుంటూ.

సాయంత్రం నాలుగు గంటలయినా కృష్ణ లేవలేదు. అనవసరంగా నిద్ర పాడుచెయ్యట మెందుకని రమణ కాఫీ సేవించి వీధిలోకి పోయేడు. అంతకు ముందే ఎప్పుడో ఆడుకోటానికి రాజిగాడు వుడాయించేసేడు.

ఎప్పటికీ కృష్ణ నిద్రనుండి లేవక పోయేసరికి రా[ధ] తల్లి 'పోయి బావను లేపవే కాఫీకి రమ్మని. అప్పుడే చీకటి పడుతుంటే ఇంకా నిద్రోతున్నారు' అంటూ రాధకు పురమాయించింది,

తల్లి ఆజ్ఞ వినేసరికి రాధకి సిగ్గు, భయం పుట్టుకొచ్చేయి. అయినా వెళ్ళక తప్పిందికాదు. మెల్లగా మేడమెట్లెక్కింది. అప్పుడే నిద్రనుండి లేస్తున్న కృష్ణ చెవుల్లో గజ్జలరవళి, గాజులు గలగలలు వినిపించి ఓరగా చూసేడు. రాధ వస్తోంది సిగ్గుపడుతూ, అడుగులో అడుగు వేసుకుంటూ.

కృష్ణ తిరిగి నిద్ర నటించేడు. రాధ గుమ్మంవరకు వచ్చి ఆగిపోయింది. రాధ అందాన్నంతా దొంగచూపులతో దొంగిలించేయటం మొదలెట్టాడు కృష్ణ. రాధ సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యపోయేడు. 'ఈఅయిదేళ్లలో ఎంత మారిపోయింది. ఆ కళ్ళల్లో చిలిపితనం, మనిషిలో చురుకుదనం ఏమయ్యాయి? ఒక్కనాడు తను వూళ్ళో లేకపోయేసరికి దిగులుపడేదే? కనిపించేసరికల్లా ఒకలా అల్లరి జేస్తేనేకాని వదలిపెట్టేదికాదే? అలాంటి రాధని గురించి మనస్సులో ఎన్నెన్నో అనుకున్నాడు కృష్ణ.

'బావా!' అని పిలవాలనుకుంది రాధ. కాని, ఆపిలుపు నోట్లోంచి బయటికి రాలేదు. రాధ పిలిస్తేనే గాని, లే[వ] కూడదనుకున్నాడు కృష్ణ.

ఎలా అయితేనేం ధైర్యం తెచ్చుకు పిల్చింది 'బావా' అని రాధ. కాని ఆ పిలుపు మరొకరికి వినిపించి వుండదు. కాని, రాధకి కాస్త ధైర్యాన్ని తెచ్చిపెట్టింది.

కృష్ణ పలుకక పోయేసరికి మళ్ళీ పిల్చింది రాధ. ఈసారి గట్టిగానే పిల్చింది. కృష్ణకి వినిపించినా సరే లేవ

లేదు. రాధ గొంతులో ఆ తీయని స్వరాన్ని పదేపదే వినాలనిపించిందతనికి. అందుకే తనిన్నాళ్లూ వువ్విళ్ళూరుతున్నది. ఆమెచేత ఇంకా ఎన్నోసార్లు పిలిపించుకోవాలని గాఢనిద్రలో మునిగివున్నట్లే నటించాడు.

ఎన్నిసార్లు, ఎంత గట్టిగా పిల్చినా లేవకపోయేసరికి విసుగు, కోపం వచ్చేయి. చివాలున ముసుగులాగేసి 'బావా' అంటూ కృష్ణను కుదిపింది.

రమణీ ఆవిధంగా తనని లేపుతున్నట్టు 'ఉండరా! బంగారంలాంటి నిద్రని పాడుచేస్తున్నావ్!' అంటూ రాధ చెయిపట్టుకున్నాడు కృష్ణ. కృష్ణకళ్ళల్లోకి రాధ తీక్షణంగా చూసింది. కృష్ణ రాధలోనికి ఏదోఆత్రుతగా చూసేడు. రాధకు సిగ్గువేసి ముఖం దించుకుంది.

కృష్ణ ప్రవర్తనకి రాధకి కోపాన్ని తెప్పించింది. కాని, ఆ కోపాన్ని బాహాటంగా ప్రదర్శించలేకపోయింది. పైగా బావమీద ఒక్కసారిగా జాలి, అభిమానము కల్గినాయి. ఈ పరిస్థితులమధ్య వూగిసలాడుతూ కృష్ణనుండి తన చేతిని విడిపించుకోటానికికూడా ప్రయత్నించలేదు. వారిద్దరిమధ్య కొద్దిక్షణాలు మౌనం ఆవరించింది.

'రాధా!'

రాధ మాట్లాడలేదు.

'నిన్నే రాధా! పలకవేం?' ప్రాధేయ పూర్వకంగా పిలిచేడు కృష్ణ.

కృష్ణ ఇలా పిలిచేసరికి రాధ హృదయం ద్రవించింది 'ఊఁ' అంది అప్రయత్నంగానే.

'నిన్నొకమాట అడగనా?'

'ఊఁ అడుగు!' కలవరించుకొనే జవాబిచ్చింది.

'అయితే అడగనా!' అన్నాడు మళ్ళీ.

'ఏమిటది అడగనా. అడగనా అని, అడిగేదేదో త్వరగా అడుగు. తొందర చేసింది రాధ. కృష్ణ పరిస్థితికి లోలో నవ్వుకుంటూ.

కృష్ణకి ఏమో అడగాలనిపించింది. కాని, ఏ విధంగా అడగాలో తెల్సింది కాదు. మౌనంగా వుండిపోయాడు రాధను చూస్తూ,

'ఏమిటి బావా' అలా చూస్తావు. చెయ్యొదులు. అడిగేదేదో త్వరగా అడుగు' రెట్టించింది రాధ.

కృష్ణకు రాధకంటె హెచ్చుగా సిగ్గు, భయం పుట్టుకొచ్చేయి. అయినా ఏదో అడగాలి. అందుకని వెంటనే ప్లాటు మార్చేసేడు.

'అయితే నేను ఇదివరకటెలానే వున్నానా?'

కృష్ణ వేసిన చచ్చు ప్రశ్న రాధని కలవరపర్చింది. కృష్ణని ఒక్కసారి పరీక్షగా చూసి సంతృప్తి చెందింది. 'ఏమో! నాకు తెలియదు బాబూ!' అంది వినీవినిపించనట్లుగా.

'అదికాదు రాధా! నేను పూర్వంలానే వున్నానా అని!' తిరిగి అదే ప్రశ్న వేశాడు.

'ఇదివరకులా ఎందుకుంటావు? పెరిగి పెద్దవాడయ్యావు. ఎంతగాని మారిపోయావు. ఆ మాటకొస్తే ఆనాటికంటె యిప్పుడే బాగున్నావ్!' అప్రయత్నంగానే అనేసింది ఆఖరి మాటలు.

'అదికాదు నే నడిగింది! నన్ను ఇదివరకంటె భావలానే చూస్తూన్నావా అని' ఏదో జ్ఞాపకం చేస్తున్నట్టుగా అన్నాడు.

రాధ మనస్సులో గత మధుర స్మృతులన్నీ అల్లా ఒకదానివెంట ఒకటి వచ్చాయి. ఆ రోజు మామిడితోపులోని దృశ్యం కళ్ళకు కట్టినట్లయింది. అదే బావ, మళ్ళీ ఈ రోజు ఈ విధంగా అడుగుతున్నాడు. ఏమని జవాబిస్తుంది? మౌనంగా వుండిపోయింది.

రాధ జవాబు కోసం ఆత్రుతగా యెదురుచూస్తున్న కృష్ణ ఆశ నిరాశయింది.

'నన్ను చూసి ఎందుకలా సిగ్గుపడుతున్నావు? భయపడుతున్నావేం? అడిగినదానికి జవాబు చెప్పవేం?' రెట్టించి అడిగాడు కృష్ణ.

రాధకెలా జవాబియ్యాలో తెల్సిందికాదు. ఎలా తెలుస్తుంది? ఆ వయస్సులో పెళ్ళికాని పిల్లని, పెళ్ళి[illegible]లనిన కుర్రాడు అలా నిలదీసి నన్ను పెళ్ళి చేసుకుంటావా?' అనడిగితే సూటిగా ఎలా సమాధానం చెప్పగలదు? అందుకనే మౌనంగా వుండిపోయింది.

'ఔనులే! నాకు తెల్సు! ఎందుకు మాట్లాడంలేదో నాకు బాగా తెల్సు. నేను అల్లరి పిల్లవాణ్ణనీ నీకంటె అందగాణ్ణి కాననీ, నేనంటే యిష్టంలేదనీ, చెప్పేయకు

డదూ! భయందేనికి వున్నదున్నటు చెప్పడానికి!' రాధ నేడిపించాలని అన్నాడు కృష్ణ.

కృష్ణ మాటలు కొరడా దెబ్బల్లా చురుక్కున తగిలాయి రాధకు. మనస్సు చివుక్కు మన్నది. గుండె పగిలినంత పనయింది. 'బావ ఇలాంటి మాటలు అంటాడని తను యెప్పుడూ వూహించలేదు. అది అతని తప్పుకాదనుకుంది. బావ వచ్చిన దగ్గర్నుంచి సరదాగా, నవ్వుతూ తనొక్కసారయినా పలుకరించిందా? ఆ రోజుల్లో తనంటే ఎంత ప్రాణమిచ్చేవాడు? తను బాధపడితే చూడలేకపోయేవాడు, ప్రతి వుత్తరంలోను తనను గురించి ప్రత్యేకించి వ్రాసేవాడు. అలాంటి మంచి బావను వచ్చిందగ్గర్నుంచి పలుకరించనైనా లేదు. చేజేతులా తన బావను, తనే దూరం చేసుకున్నది. బావను అనవసరంగా తనే బాధ పెడుతున్నది. తనెంత సరదాగా వచ్చాడో ఆ బావ ఆనందాన్నంతా బూడిదపాలు చేసింది తనే.'

రాధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నునుపైన చెక్కిళ్ళ మీదనుంచి కారి కృష్ణ చేతులుమీద పడ్డాయి. ఆశ్చర్యంగా కృష్ణ రాధ ముఖంలోకి చూసేడు. ఇంకా నీళ్లు కారుతూనే వున్నాయి. రాధలో పొంగి పొరలుకొస్తున్న దుఃఖాన్ని ఎంత అపుకుందామని ప్రయత్నించినా ఆగటం లేదు.

తనవసరంగా పరిహాసం చేసినందుకు ఎంతో బాధ పడ్డాడు కృష్ణ.

'అదేమిటి రాధా! ఏడుస్తావెందుకూ? నేనేమన్నానని?'

'ఏమీలేదు బావా!'

'ఏమీలేదంటావేం? ఏడుస్తూ.

'నీతో ఎప్పుడన్నా అలా అన్నానా?' ప్రశ్నించింది రాధ.

'ఏమని?' అడిగాడు కృష్ణ.

'అదే నువ్వన్నది' జ్ఞాపకం చేసినట్టుగా అంది రాధ.

'ఏమిటి లేనన్నది' ఏమీ తెలియనట్లుగా చూసేడు కృష్ణ.

రాధకు అంత దుఃఖంలోనూ సిగ్గేసింది చెప్పడానికి. కాని పరిస్థితి తారుమారవటంచేత చెప్పక తప్పిందికాదు.' అదే! నువ్వందంగా వుండవని! నువ్వంటే ఇష్టంలేదని! తల వంచుకునే చెప్పేసింది రాధ.

'ఓరొయ్య పిచ్చి పిల్లా! నేనూరికే సరదాకి అన్నానుగాను, నువ్వలా ఏడుస్తావంటే అనకేపోదును! తెలియక పసుతానుకాని, ఆ రోజుల్లో మాటకు మాట అప్పజెప్పే పెంకి ఘటానివి. నీకు ఈ సిగ్గు, భయం, ఏడుపు ఎప్పుడు ఉద్భవించేయి? సరిసరి! చెక్కిళ్ళు తుడిచాడు కృష్ణ.

'రాధా! నేనిప్పుడెందుకొచ్చానో తెలుసా అమ్మను కూడా తీసుకుని. నేను అఫీసుకు పోతే, అమ్మ ఒక్కత్తె ఇంట్లో కూర్చోవలసివస్తోంది. తోడెవరూ లేరు. మావయ్యకూడా చాలాసార్లు రాశాడులే. పైగా అమ్మకూడా బలవంతం చేస్తోంది. వీటన్నిటికన్నా - నీ అందం, చిలిపితనం, కుర్రకారు చేష్టలు మరీని. అందుకనే మావయ్యతో చెప్పి మూడు ముళ్ళూ పడేసి, నిన్ను ఎత్తుకుపోవడానికి ముహూర్తం నిశ్చయించమని చెప్పడానికే వచ్చేను. మరి నీకు ఇష్టమేనా?' అంటూ రాధ రెండు బుగ్గల్ని పుచ్చుకువూపి, దగ్గరగా తీసుకుపోయాడు కృష్ణ.

'ఫో బావా! నువ్వు మరీని! ఎవరయినా చూస్తారనేనా లేదు' తేలిక పడిన హృదయంతో, మునిమునిగా నవ్వుతూ అంది.

'చూడనీ! నాకేం?'

'సరే బావుంది కాని, కాఫీకి రమ్మంటోంది అమ్మ! లే' అంటూ ఒక్క వూపున లేచి త్రోసింది. కృష్ణ ఆనందంతో చక చక మేడ దిగిపోయేడు.

అప్పటికప్పుడే చీకటి పడింది. ఆకాశంనిండా తారకలు తమ ప్రియుని రాక కోసం ఆతృతగా చూస్తూ, యేదో వూహించుకుంటున్నాయి. వెన్నెల చంద్రుడు తారకల నాధుడు. కృష్ణ రాధవాడు. రాధ కృష్ణపరం అయిపోతున్నది త్వరలో. కాదు. ఏనాడో అయిపోయింది. లోకం కోసమే యిప్పుడవబోతున్నది. తను కనిన కలలన్నీ ఒక రూపం పొందబోతున్నాయి. ఏదో తీయని ఊహలతో మురిసిపోయింది రాధ. రాధ మనస్సులో మెరుపు మెరిసింది! వలపు పిలిచింది! ఒళ్ళు పులకించింది.! తన్మయత్వంలో బావకోసం పరచి తెల్లని ప్రక్కమీద వ్రాలిపోయింది ఆకాశంలోకి చూస్తూ. అప్పుడే ఉదయిస్తున్న చంద్రుని రాకను చూసి తారకల హృదయాలు వికసించాయి. తారానాధుని చలువ వెన్నెలల జల్లులు రాధ హృదయాన్ని ఆనందంతో నాపినై. ఆ తన్మయత్వంలో ఏవేవో అనుభూతులు పొందుతూ తనలో తనే నవ్వుకుంది రాధ!